

హెల్త్ సెంటర్లలో భద్రత పెంచాలి

గ్రామాల్లో హెల్త్ సెంటర్లకు ప్రహరీలు నిర్మించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు ప్రశాంతంగా విధులు నిర్వర్తించేలా సెక్యూరిటీ గార్డును నియమించాలి. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా ఉండాలి. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి పటిష్ట భద్రత కల్పించాలి.

– కె.రజిని, ఎంఎల్‌హెచ్‌పీ, పాతసింగరాయకొండ



డాక్టర్లకు భద్రత కల్పించాలి

ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రేయింబవళ్లు పనిచేస్తాం. ఒక్కోసారి రోగి బంధువులు మద్యం సేవించి అమర్యాదగా ప్రవర్తిస్తారు. ఇలాంటి వారి ప్రవర్తనతో మహిళా డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఆశాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు అడపా దడపా వైద్యశాలలకు వస్తే వైద్యులు, సిబ్బందిలో కొంత ధైర్యం వస్తుంది.

– డాక్టర్ నందిరెడ్డి మురళి, పీహెచ్‌సీ, సీఎస్‌పురం



క్లుప్తంగా

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యవతి

బేస్తవారిపేట: హెచ్‌ఐవీ వైరస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సత్యవతి అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ కళాశాలలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో హాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ కటికల విజయకుమారి మాట్లాడుతూ హెచ్‌ఐవీ వైరస్ ఎలా సోకుతుంది, సోకకుండా ఎలాంటి జాగ్రత్త పడాలి, వ్యాధి సోకితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం విజయ, హెచ్‌ఓసీ సిబ్బంది శ్రావణి, ప్రసన్న, విజయ, హసీనా, విజయకుమారి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఫోన్ ద్వారా వారి సమస్యఉ తెలియజేస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 99592 25702 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

వినూత్న ఆలోచనలతో ఉద్యోగాలు



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

మార్కాపురం: విద్యార్థులు ఉద్యోగం సాధించాలంటే వినూత్నంగా ఆలోచించాలని ఫిజియాలజిస్ట్, మోటివేటర్ డాక్టర్ త్రివేది వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య అధ్యక్షతన లీడర్‌షిప్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ లైఫ్ స్కిల్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రంగనాయకులు, ఏట బి.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పీవీ అనీల్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

దర్గాలో మంత్రులు, ఎమ్మెల్యేల పూజలు



దర్గా వద్ద మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో హజరత్ ఖాశీం స్వామి దర్గాలో మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, ఎంఎం కొండయ్య, ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, దామచర్ల సత్య మంగళవారం మొక్కులు చెల్లించారు. వారి వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి భాషాపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చిన్నప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

కోలాహలంగా ప్రతిష్ఠ మహోత్సవాలు



కలశ పూజలో విగ్రహమూర్తులు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో పోలేరమ్మతల్లి, పోతురాజు స్వామి విగ్రహ, శిఖర, కలశ, ఆదిత్య నవగ్రహ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేదపండితులు పోతులూరి శివరామాచార్య ఆధ్వర్యంలో రుద్ర హోమాలు, క్షీరాధివాసం, సహస్రనామ తదితర పూజలు చేశారు. కలశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు వ్యవహరించారు. బుధవారం అమ్మవారి విగ్రహ పతిష్ఠ, కలశ, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు అన్న సంతర్పణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



కంభం రైల్వేస్టేషన్



రెండో ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు నిర్మిస్తున్న లిఫ్టులు

అభివృద్ధి దిశగా కంభం రైల్వేస్టేషన్



రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద అభివృద్ధి పనులు



నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రహరీ

- అమృత్ భారత్ పథకంలో రూ.11 కోట్లతో ఆధునికీకరణ
- చురుగ్గా సాగుతున్న అభివృద్ధి పనులు
- సుందరంగా తీర్చిదిద్దుకుంటున్న పరిసరాలు

కంభం: అమృత్ భారత్ పథకంలో భాగంగా కంభం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. కంభం రైల్వేస్టేషన్‌కు చుట్టుపక్కల మండలాల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఆర్మీలో పనిచేసే వారు అధికంగా ఉండటంతో వారంతా కుటుంబంతో కలిసి రైళ్లలో వెళ్తుంటారు అందుకోసం వారు ఎక్కువగా రాత్రి సమయంలో రైల్వే స్టేషన్‌లో వేచి ఉండాల్సి ఉంటుంది. వందలాది మంది రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు స్టేషన్ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాత్రిపూట మొదటి ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లాలంటే ఓవర్ బ్రిడ్జి మెట్లు ఎక్కలేని వృద్ధులు, వికలాంగులు, లగేజీ అధికంగా ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఈ నేపథ్యంలో గతేడాది కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశంలో పలు రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసింది. అందులో భాగంగా కంభం రైల్వే షన్ ఆ పథకం కింద ఎంపిక కావడంతో రైల్వేస్టేషన్ అభివృద్ధి కానుంది.

రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు

అమృత్ భారత్ పథకంలో గతేడాది రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. తొలుత నత్తనడకన సాగిన పనులు ఇటీవల కాలంలో ఊపందుకున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా అదనపు గదుల నిర్మాణం, ప్లాట్‌ఫాంల పెంపు, గ్రానైట్, టైల్స్ పరచడం, రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆధునికీకరణ, బయట ప్రాంగణంలో ప్రహరీ ఏర్పాటు చేసి పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మొదటి ప్లాట్ ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండటంతో వృద్ధులు, వికలాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఇప్పటికే లిఫ్ట్ నిర్మాణం చివరి దశకు చేరుకోగా రంగులు వేస్తున్నారు. రైల్వే స్టేషన్ ముఖద్వారం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం చుట్టూ ఇప్పటికే ప్రహరీ నిర్మాణం పూర్తికాగా పార్కింగ్ టైల్స్ వేస్తుండటంతో పరిసరాలు అందంగా తీర్చిదిద్దుకుంటున్నాయి. అభివృద్ధి పనులు పూర్తయితే కంభం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుతాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ ట్రైన్స్ ఆగేలా చూడాలి

కంభం రైల్వేస్టేషన్‌కు కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, కనిగిరి మండలాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనిగిరి పట్టణం నుంచి రాత్రి పూట కంభం రైల్వేస్టేషన్‌కు బస్సు సౌకర్యం కూడా ఉందంటే కంభం రైల్వే స్టేషన్‌కు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కంభంలో పలు ఎక్స్ రైళ్లు ఆగుతుండగా గరీబ్ రథ్, పూరీ–యశ్వంత్ పూర్ ఎక్స్ ప్రెస్, ధర్మవరం ఎక్స్ ప్రెస్ వంటి స్పెషల్ ట్రైన్స్ ఆపక పోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ఆర్మీ ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి అన్నిరకాల రైళ్లను ఆపేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



గుంటూరు, విజయవాడ వెళ్లాలంటే రాత్రి పూట స్టేషన్ వస్తే అసౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతుండటంతో స్టేషన్ అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

వెంకటేశ్వర్లు, రావిపాడు

వీక్లీ స్పెషల్ ట్రైన్స్ ఆపాలి



కంభం రైల్వేస్టేషన్‌లో గరీబ్ రథ్, ధర్మవరం ఎక్స్ ప్రెస్, ఇతర వీక్లీ ట్రైన్స్ ఆపక పోవడంతో ఒక్కోసారి గిద్దలూరుకు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. ఆర్మీ ఉద్యోగులు అధికంగా రైల్వే స్టేషన్ నుంచి వెళ్తుంటారు. ఇక్కడ అన్ని రైళ్లు ఆగితే మాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

సయ్యద్ ఫయాజ్, ఆర్మీ ఉద్యోగి

మురుగుపోయే దారేది?



నిలిచిన మురుగు



మురుగు నీరు కిందకు రాకుండా పోస్తున్న మట్టి

కంభం: డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేక మురుగు నీరంతా ఇళ్లకు సమీపంలో నిలిచిపోతోందని పలుమార్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కరించలేదని అసహనం వ్యక్తం చేసిన స్థానికులు.. ట్రాక్టర్ మట్టి తోలించి మురుగు నీరు ముందుకు రాకుండా అడ్డుగా కట్ట వేశారు. వివరాలు.. స్థానిక అర్బన్ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో పైనుంచి వచ్చే మురుగు నీరు పోయేందుకు మార్గం లేక ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిపోతుంది. దీంతో పరిసరాలు మొత్తం దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తి పెరిగిపోతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు ఎక్కువగా వస్తే రోడ్డుపైకి పారుతుండటంతో అటువైపు తిరిగే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని మొదటి లైనుకు వెళ్లే మార్గంలో మట్టి రోడ్డు కింద ఉన్న మురుగునీరు సక్రమంగా రాకపోవడంతో అక్కడా మురుగునీరు నిలిచిపోతుంది. మురుగు నీరు కిందకు వెళ్లకుండా అడ్డుకట్ట వెయ్యడంతో ఆ నీళ్లన్నీ రోడ్లపైకి వచ్చి సమస్య మరింత జఠిలమవనుంది. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి ఉత్సవం



అలంకరణలో పెద్దమ్మ తల్లి

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట గ్రామంలో మంగళవారం రాచూరి పెద్దమ్మతల్లి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులతోపాటు వడ్డెర కాలనీ, తన్నీరువారిపల్లి వాసులు బోనాలతో మేళతాళాల నడుమ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. వేదపండితుడు నారాయణశర్మ పూజలు నిర్వహించారు. ఉభయదాతలతో సహస్రనామ పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. మంగళవారం రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.



బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

హెల్మెట్‌లతో పోలీసుల బైక్ ర్యాలీ



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్సైలు, సిబ్బంది



హెల్మెట్ ఉపయోగంపై మాట్లాడుతున్న సీఐ సురేష్



హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్సై రవీంద్రారెడ్డి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

- అవగాహన ర్యాలీలో పోలీసు అధికారులు

కంభం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చని ఎస్సై బి.నరసింహారావు అన్నారు. మంగళవారం సాయంత్రం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో కలిసి పోలీసులు హెల్మెట్ ధరించి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కందులాపురం కూడలి, వైజంక్షన్ మీదుగా కంభం బస్టాండు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో ప్రజలకు హెల్మెట్ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పోలీసులు ఫైన్ వేస్తారన్న భయంతో కాకుండా హెల్మెట్ ధరిస్తే తమ ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్న ఉద్దేశంతో హెల్మెట్ ధరించాలని సూచించారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు తలకు హెల్మెట్ ఉంటే అది కవచంలా కాపాడుతుందన్నారు.

గిద్దలూరు రూరల్: బైక్‌లు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించి వాహనాలు నడపాలని సీఐ సురేష్ అన్నారు. పట్టణంలోని రాచర్లగేటు సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద హెల్మెట్ వాడితే కలిగే ప్రయోజనాల గురించి వాహనదారులకు మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెంట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఉన్న ఒక తలను సురక్షితంగా కాపాడుకోవాలంటే ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెంట్ ఉపయోగించాలన్నారు. రోడ్లపై అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ప్రవర్తించడంపై ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. వాటిని నివారించేందుకు తగు జాగ్రత్తలు సూచనలు తెలియజేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బేస్తవారిపేట: మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జంక్షన్ నుంచి చింతలపాలెం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ శాతం మరణాలు తలకు తగిలిన గాయాలతో జరుగుతున్నాయన్నారు. తలకు గాయమైతే లక్షలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని, మిమ్మల్నే నమ్ముకున్న కుటుంబాలను ఇబ్బందులపాలు చేయవద్దని కోరారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని వాహనదారులకు సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడంతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు.

మార్కాపురం రూరల్: రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా టూవీలర్స్‌పై వెళ్లేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం హెల్మెట్ వినియోగంపై ఎస్సైలు సైదుబాబు, అంకమరావుతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో బైక్‌లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. కారులో వెళ్లేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, టూవీలర్స్‌పై బయటకు వచ్చేప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు లైసెన్స్ ఉంటేనే వాహనాలు ఇవ్వాలని, వాహనాలు నడిపేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. అత్యంత వేగంతో వాహనాలు నడుపుతూ విలువైన జీవితాన్ని పోగొట్టుకోవద్దని సీఐ హితవు పలికారు.

ఈ పక్క చూపులు ఎవరికోసమో?

మార్కాపురం: శాంతి భద్రతలు, నేరగాళ్ల కదలికలు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ చొరబాట్ల పరిశీలనకు మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దిశ మార్చి చూస్తున్నాయి. రూరల్ పరిధిలోని వేములకోటలో, కుంట వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలదీ అదే పరిస్థితి. సీసీ కెమెరాలు పక్క చూపులు చూస్తుండటాన్ని గమనించినవారంతా ''ఔరా' అని ఆశ్చర్యపోతున్నారు. వాటిని సరైన దిశలో ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో దిశ మారిన సీసీ కెమెరా



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సాక్షి ఎఫెక్ట్..



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి

బేస్తవారిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి అన్నారు. మంగళవారం 'సాక్షి'లో 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో విషజ్వరాలతో వైద్యశాలలకు క్యూ కడుతున్నారని ప్రచురితమవడంతో బేస్తవారిపేట, గలిజేరుగుళ్ల పీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాలను సక్రమంగా పూర్తి స్థాయిలో నిర్వహించాలని, గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో పంచాయతీ అధికారులకు చెప్పి ఆయిల్‌బాల్స్ వేయించాలని, గృహాల్లో నీటిని నిల్వ చేసుకునే వాటిని పరిశీలించాలని, ఎబెట్ రసాయనాన్ని పిచికారీ చేయించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీరాజ్, లక్ష్మీ జలేందర్, పీహెచ్‌సీ అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శేషుకుమార్

మార్కాపురం టౌన్: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్ కోఆర్డినేటర్ ఎం శేషుకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో ఏకేయూ వీసీ సూచనల మేరకు ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూదన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశం గొప్ప సంపద యువతేనని, మత్తు పదార్థాలకు బానిసై ఆ గుర్తింపును కోల్పోవద్దని హితవు పలికారు. కన్వీనర్ ఎం.రాఘవేంద్ర మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసైతే విచక్షణ కోల్పోతారని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పొదిలి నగర పంచాయతీ కమిషనర్ బదిలీ



చివరి రోజు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పొదిలి: స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన నెల్లూరు జిల్లా పొదలకూరు నుంచి పొదిలిలో నియమితులయ్యారు. తాజాగా చేపట్టిన సాధారణ బదిలీల్లో యథాస్థానానికి వెళ్లారు. గత నాలుగు నెలలుగా సమస్యలపై తక్షణమే స్పందించిన ఆయన పొదిలి వాసుల అభిమానం చూరగొన్నారు.